తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

పేజీలు : 08

శుక్రవారం
30 ఆగస్ట్ 2024



Follow :

# పట్టా భూముల్లో రెవెన్యూ అధికారుల కూల్చివేతలు

## తమకు తగిన న్యాయం చేయాలి : బాధితుల ఆవేదన

**కాప్రా, ఆగస్టు 29 (జనంసాక్షి)**

పట్టా భూముల్లో రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టడం అన్యాయమని ప్లాట్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం చక్రిపురంలోని సర్వే నెంబర్ 215 లో రెవెన్యూ అధికారులకు కూల్చివేతలపై బాధితులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. తమ రికార్డులను పరిశీలించకుండా రెవెన్యూ అధికారులు తొందరపడి, తమ ఆస్తి నష్టం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు వివరాల ప్రకారం అను ఇంధన సంస్థ(ఎన్ ఎఫ్ సి) స్థాపన కోసం 1966లో 587.26 ఎకరాల భూమి కోసం సెక్షన్ 4(1)కింద ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గెజిట్ నెంబర్





310 తేదీ 17 నవంబర్ 1966, సెక్షన్ నెంబర్ 06 గెజిట్ 328 తేదీ 09 డిసెంబర్ 1966 సంవత్సరంలో ప్రకటించారు. అవార్డు కంటే ముందే ప్రభుత్వం తమ వద్ద నిధులు లేవని, కొంత భూమిని భూ సేకరణ నుంచి ఉపసంహరించుకోమని కోరడంతో సర్వే నెంబర్లు 215 నుంచి 219, 222, 223/15, 227, 228, 229లలో 108.11 ఎకరాల భూమిని తొలగించి, అవార్డు నెంబర్ ఈ/577/1966 తేదీ 29 సెప్టెంబర్ 1969 పై సర్వే నెంబర్లను ఉపసంహరించుకుని అవార్డును పాస్ చేసింది.ఎన్ ఎఫ్ సి కోసం 479.09 అవార్డును పాస్ చేసి భూ యజమానులకు పరిహారం చెల్లించింది. ఇండస్ట్రీస్, కామర్స్ 22 మే 1972లో మెమో నెంబర్ 703/ ఎఫ్ 11/72-1 ప్రకారము108.11 భూమిని ఉపసంహరించుకుంది. ఈ వివరాలను గెజిట్ నెంబర్ 139 తేదీ 22 మే 1972 లో పొందుపరిచారు. 1969-70 మధ్యకాలంలో పహానిలో పట్టాదారుల పేర్లను తొలగించకుండా కాస్తు కాలంలో ఈసీఐఎల్ అని పేర్కొన్నారు. 1971-72 మధ్యకాలంలో కాస్తు కాలంలో ఈసీఐఎల్ ను తొలగించి, పట్టాదారులకు స్వాధీనం చేసి వారి పేర్లు చేర్చారు. మొలుగు వారసులు పార్టిషన్ కోసం దావా వేసి తేదీ 29 ఏప్రిల్ 1988 న పంపకాలు చేసుకొని కోర్టు నుంచి 295/84 ప్రకారం ఆర్డర్ పొందారు. వారి వారి పంపకాల ప్రకారం ప్లాట్లు చేసి, భూములను అమ్ముకున్నారు. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటికేషన్ నెంబర్130 ఆఫ్ 2014 లో ప్రదీప్ కుమార్ అనే ప్రైవేటు వ్యక్తి హైకోర్టులో రిట్టు వేశారు. కోర్టు సెలవు దినాలైనప్పటికీ రిట్టు వేసిన వెంటనే, అదే రోజు హైకోర్టులో జడ్జిమెంట్ ఇచ్చారు. 8 వారాల్లో పొజిషన్ తీసుకోవాలని కలెక్టర్ కు ఆర్డర్ చేశారు.రివ్యూ పిటిషన్ నెంబర్ 257 ఆఫ్ 2014 న ఫీల్ నెంబర్ 130 ఆఫ్ 2014 మొలుగు మహిపాల్ రెడ్డి అండ్ అదర్స్ హైకోర్టు లో దావా వేశారు. మొలుగు భారతి,నరేందర్ రెడ్డి, రాములు, ఇందు, శ్రీరాములు అండ్ అదర్స్ సివిల్ అప్పీల్ 8751-8752, 8753-8754, 8754-8755, 8755-8756, 8756-8757, 8757-8758 ప్రకారం సుప్రీంకోర్టులో దావా వేశారు. హైకోర్టు ఇచ్చిన రెండు జడ్జిమెంట్లను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. 108.11 ఎకరాల భూమి విషయమై 2014 వరకు అన్ని శాఖలు ఉపసంహరించుకున్నాయి. తేదీ 30 మార్చ్ 1995 లో డాక్యుమెంట్ నెంబర్లు 2649/95, 2650/95 ప్రకారం ప్లాట్ నెంబర్లు 124 నుంచి 130 వరకు1628 గజాల స్థలాన్ని మొలుగు భారతి కొనుగోలు చేసి, ఇంటి నెంబరు, ప్రాపర్టీ టాక్స్, కరెంట్ బిల్లు, ఎల్ ఆర్ ఎస్ కూడా చెల్లించాము. గత ఏడు సంవత్సరాలుగా అక్కడ నివాసం ఉంటున్నారు. ఇట్టి భూమి ప్రభుత్వానికి కాదని, తమకు చెందిన స్థలమేనని గతంలో జిల్లా కలెక్టర్, ఆర్డీవో, కాప్రా తాసిల్దార్ల దృష్టికి తీసుకెళ్లి రికార్డులను సైతం సమర్పించాము. వీటినేమీ పరిశీలించకుండా కాప్రా తాసిల్దార్ సుచరిత ఏకపక్షంగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తెల్లవారుజామున నాలుగు గంటలకు సమయంలో ఆయా ఇండ్లలో నిద్రపోతున్న కుటుంబాలను లేపి, సెల్ఫోన్లను దౌర్జన్యంగా లాక్కొని సామాన్లను బయటపడేసి, రెండు గంటల పాటు కూల్చివేతలు చేపట్టారు. పట్టా భూముల్లో అక్రమంగా కూల్చివేతల చేపట్టిన తహసిల్దార్ పై చర్యలు తీసుకుని, తమకు తగిన న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ సమావేశంలో మొలుగు రుక్మారెడ్డి, ప్రకాష్ రెడ్డి, నరసింహన్, శ్రీశైలం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై ఇంటింటికి సర్వే

### వ్యవసాయ అధికారి శంకర్ రాథోడ్

**కొడంగల్ ఆగస్టు29(జనం సాక్షి):** తెలంగాణ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు లక్షల రుణమాఫీకి మూడు విడతలో అర్హత ఉండి వివిధ కారణాలతో రుణమాఫీ పొందని వారికోసం కొడంగల్ మండలం హస్నాబాద్ గ్రామములో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించామని కొడంగల్ ఏడిఏ శంకర్ రాథోడ్ తెలిపారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లు ఆడుతూ ఆగస్టు 29 నుండి సెప్టెంబర్ 06 వరకు రుణ మాఫీలో కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం మండలంలోనీ అన్ని గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు ఇంటింటికి వెళ్ళి వివరాలు సేకరించడం జరుగుతుందనీ తెలియ జేశారు.కార్యక్రమంలో ఏఈవోలు రాజు రాథోడ్,ఎండి.వసీం,సుమ పావని పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై పరిశీలన

**రాజేంద్రనగర్, ఆగస్టు29(జనం సాక్షి) :** సెప్టెంబర్ 7న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లపై రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ పరిశీలించారు. గురువారం జిహెచ్ఎంసి కమిషనర్ కె. రవికుమార్ , వివిధ పార్టీల నాయకులు కలిసి పత్తి కుంట, పల్లె చెరువుల వద్ద 3 వ రోజు నుంచి 10వ రోజు వరకు జిహెచ్ఎంసి పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల నిమజ్జన ఏర్పాట్లు సజావుగా సాగే విధంగా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని ఇలాంటి అవాంఛన్లు సంఘటన జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసిపి శ్రీనివాస్ డిఇఇ నరేందర్ గౌడ్, ఎస్డబ్ల్యూ ఎస్ అధికారులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఎన్.మల్లారెడ్డి, మల్లేష్ యాదవ్, కొమురయ్య, బొక్క బాల్రెడ్డి, రామేశ్వర్ ధనుంజయ తదితరులు ఉన్నారు.



# దోపిడి దొంగతనాల కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

### దేశ తయారీ తుపాకీ, బుల్లెట్

### ఫ్యాషన్ ప్రో బైక్, రూ.200లు సీజ్ చేసిన పోలీసులు





**రాజేంద్రనగర్,ఆగస్టు29(జనం సాక్షి) :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్, సైబరాబాద్ దోపిడీ దొంగతనం కేసుల్లో నిందితుల అరెస్ట్ చేసిన రాజేంద్రనగర్ పోలీసులు. సైబరాబాద్ రాజేంద్రనగర్ క్రైమ్ పోలీసులు, రాజేంద్రనగర్ ఎసిపి శ్రీనివాస్ ల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిందితులను పట్టుకున్నారు.గురువారం రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ తెలిపిన విరాల ప్రకారం గత రెండు సంవత్సరాల క్రితం బీహార్ రాష్ట్రం నుంచి వలస వచ్చి పలు సంస్థల్లో డెలివరీ బాయ్ గా చేరారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి కొద్దీ రోజుల్లోనే అధిక డబ్బు సంపాదించాలని లక్ష్యం చేసుకొని దాడి దోపిడీ దొంగతనాలకు పాల్పడాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలోనే అత్తాపూర్ పిల్లర్ 190 వద్ద హ్యాపీ హోమ్స్ లో నివసించే ఎ1 నిందితులు మహమ్మద్ ముసాహిద్ ఆలం, ఎ-2గా మహమ్మద్ దిల్బర్, ఎ3గా మహమ్మద్ షా నవాజ్ లు పథకం ప్రకారం ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిపై దాడి చేసేవారని కొందరు ఫిర్యాదుతో ఆగస్టు 22న జనచైతన్య అపార్ట్మెంట్స్ సమీపంలోకి రాగానే, వారు ఉద్దేశ్యపూర్వకంగా ఫిర్యాదుదారుని వాహనాన్ని వెనుక నుండి ఢీకొట్టి, కత్తితో బెదిరించి, రూ.11,000 దోచుకున్నారని,ఇదే దోపిడీ కేసు, ఇందులో నిందితులు బాధితురాలిని కాల్పులు జరిపి వారిని బెదిరించి సెల్ఫోన్లు డబ్బును దోచుకెళ్లారు. అలాగే 21న బండ్లగూడ జాగీరు వద్ద మధ్యాహ్నం ప్యాషన్ ప్రో బైక్పై కిస్మత్పురా బ్రిడ్జ్ దగ్గర ఉన్న అతన్ని ఆపి, బెదిరించి బాధితుని సెల్ఫోన్ 200 నగదును దోచుకున్నాడు.సైబరాబాద్ ఆయుధ చట్టం కింద నిందితులపై పలు కేసులు నమోదు చేసి ఇద్దరు నిందితులు మహమ్మద్ ముసాహిద్ ఆలం, ఎ-2గా మహమ్మద్ దిల్బర్ లను అరెస్టు చేయగా, మరో నిందితుడు ఎ3మహమ్మద్ షా నవాజ్ పరారీలో ఉన్నాడని, పట్టుబడిన నిందితుల నుంచి దేశం ఫైర్ ఆర్మ్ ఒక బుల్లెట్, ప్యాషన్ ప్రో బైక్ ఆఫ్ మొబైల్ ,నగదు 200లు స్వాధీనం చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు.దీంతో రాజేంద్రనగర్ క్రైమ్ రాజేంద్రనగర్ పోలీస్ సిబ్బందిని డిసిపి సి. శ్రీనివాస్ అభినందించి రివార్డులు అందజేశారు.

# డ్రైవర్‌పై చర్యలు తీసుకోండి

**మర్పల్లి ఆగస్టు 29(జనం సాక్షి) :** డ్రైవర్ నిర్లక్ష్యంతోనే తాము ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడిందని, దీంతో తాము గాయల పాలయ్యాయని డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని మర్పల్లి మండ కేంద్రానికి చెందిన మొగలి గారి శాతంమ్మ మర్పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో పాటు ఏడుగురు ఆటోలో(నెంబర్ ఏపీ28టీవీ1571) గురువారం మోమిన్ పేట్ నుంచి మర్పల్లికి వస్తుండగా సిరిపురం - కొత్లాపూర్ గ్రామాల మధ్యలో గల కల్వర్టు దగ్గరకు రాగానే ఆటో పల్టీ



కొట్టిందని ఫిర్యాదు లో పేర్కొన్నారు. డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడటమే ఇందుకు



కారణమని, ఈ యాక్సిడెంట్ లో తనతో పాటు అందరూ గాయలపాలయ్యారని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై విచారణ జరిని డ్రైవర్ గౌస్ పై చర్యలు తీసుకోవాలని మర్పల్లి ఎస్ఐ సురేష్ ని కోరారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు

### ఎస్‌హెచ్ఓ ఎ.నాగరాజు




**అల్వాల్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అల్వాల్ ఎస్ హెచ్ ఓ ఎ.నాగరాజు హెచ్చరించారు. బొల్లారం జంక్షన్, సుచిత్ర జంక్షన్ లలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ నాగరాజు మాట్లాడుతూ రాంగ్ రూట్ డ్రైవింగ్ పై రెండు చోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు వెల్లడించారు. వాహనదారులు ఇష్ట రాజ్యాంగ వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారని తెలిపారు. రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేసి పట్టుపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బొల్లారం, సుచిత్ర జంక్షన్ లలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 24 వాహనాలను సీజ్ చేసి 2 కేసులు పెట్టామని, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించామని ఆయన వివరించారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాల గురించి, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయవద్దని, దానివల్ల జరిగే పరిణామాలను వివరించినట్లు చెప్పారు. ప్రయాణికులందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ మానేసి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి హెల్మెట్ ధరించాలని సూచించారు

# ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాం..

### మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు, అగస్టు 29(జనంసాక్షి) :** ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, తాండూరు ప్రజల ప్రేమ, అభిమానం మరువలేనివని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు.గురువారం తాండూరు పట్టణంలోని పైలెట్ రోహిత్ రెడ్డి నివాసం పక్కన నూతనంగా నిర్మించిన క్యాంప్ ఆఫీస్ ను ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆతిథ్యం స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఇబ్బందులు కలగకుండా నూతన క్యాంప్ కార్యాలయం నిర్మించినట్లు తెలిపారు.

## పందెన్ వాగులో పోసిన మట్టిని తొలగించిన అధికారులు



**రాజేంద్రనగర్, ఆగస్టు29(జనం సాక్షి) :** మణికొండ మున్సిపాలిటీ అధికారులు ఆక్రమణాలపై ఉక్కు పాదం మోపుతున్నారు.గురువారం కమిషనర్ ప్రదీప్ కుమార్ ఆదేశాలతో టిపిఓ సంతోషి పందెన్ వాగులో పోసిన మట్టిని అధికారులు జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్, టిపిఓ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు నాళాలు చెరువుల కబ్జాకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఎంసిపల్లి మండల ఆర్ఐలకు వీడ్కోలు

**శామీర్‌పేట్ (జనం సాక్షి ):** మూడు చింతలపల్లి మండలంలో ఆర్ ఐ గా విధులు నిర్వహించిన రాఘవ సాగర్, నరేష్ లు బుధవారం బదిలీపై వెళ్లారు. గత కొంతకాలంగా మూడు చింతలపల్లి తాహసిల్దార్ కార్యాలయం లో ఉత్తమ సేవలందించిన రాఘవ సాగర్ నరేష్ లను తాహసిల్దార్ వెంకట నరసింహారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ నాగజ్యోతి శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాఘవ సాగర్ శామీర్పేట్ కు బదిలీ కాగా, నరేష్ మేడ్చల్ కు బదిలీపై వెళ్లారు. విరిస్తానంలో కుత్బుల్లాపూర్ నుంచి రజినీకాంత్, మేడ్చల్ నుంచి సరస్వతి బదిలీపై ముడిచింతలపల్లి తాసిల్దార్ కార్యా లయానికి విచ్చేశారు. తాహసిల్దార్ కార్యాలయం సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ కార్య క్రమంలో మూడు మూడు చింతలపల్లి తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# కురువలు అన్ని రంగాల్లో రాణించాలి

### కురువ సంఘం బలోపేతానికి పనిచేయాలి

### మండల నూతన అధ్యక్షుడిగా కోహిర్ గోపాలకృష్ణ ఎన్నిక

### తాండూర్ డివిజన్ అధ్యక్షుడు నాగారం జగదీష్

**పెద్దేముల్ ఆగస్టు 29(జనం సాక్షి)** కురువ కులాస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ దిశగా ప్రతి ఒక్కరు అడుగులేయాలని తాండూరు డివిజన్ కురువ సంఘం అధ్యక్షుడు నాగారం జగదీష్ పేర్కొన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో కురువ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ... కురువ సంఘం కోసం ప్రతి కురువ కులస్తుడు కృషి చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు వేసి సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు అనంతరం మండల నూతన కురువ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా కోహిర్ గోపాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శిగా రఘు, ఉపాధ్యక్షుడిగా బాలు, కోశాధికారిగా మాద. అనంతయ్య, సహాయ కార్యదర్శిగా గోపాల్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సీనియర్ నాయకులు పూజారి పాండు, కోహిర్. రవిశంకర్, నాగులపల్లి నర్సిములు, లక్ష్మయ్య, గొట్లపల్లి మల్లప్ప,శేఖర్,గోదే మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ లక్ష్మీ సుదర్శన మహా యజ్ఞం



**అల్వాల్, ఆగస్టు 29(జనం సాక్షి) :** శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆల్వాల్ లో శ్రీలక్ష్మి సుదర్శన మహా యజ్ఞ ము నిర్వహించారు. లోక కళ్యాణం కోసం ,ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని స్వామివారి ఆశీస్సులు ఉంటాయని తెలియపరిచారు. ఈరోజు మొదలైన ఈ యాగం శనివారం వరకు కొనసాగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని భక్తులను కోరారు. ఆలయ వంశపారంపర్య చైర్మన్ శ్రీ రాజా సంజయ్ గోపాల్ సైన్చర్, కార్యనిర్వాహణాధికారి మఠం వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహా కృతవును యజ్ఞకులు విజయసారథి చేతుల మీదుగా కొనసాగింది. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక అర్చకులు రఘు పంతులు ,శ్రీనివాస్ పంతులు, వంశీ పంతులు సంఘ సేవకులు ,ఆలయ అభివృద్ధి సభ్యులు వెంకటరామిరెడ్డి శివరామకృష్ణ ,సురేందర్ రెడ్డి, రామచంద్ర రావు ఆలయ సిబ్బంది సురేందర్ ,వెంకట్ రెడ్డి పాల్గొన్నారు .యాగంలో పాల్గొన్న వారికి అన్న ప్రసాద వితరణ జరిగింది.

# మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో రామమూర్తి పంతులు జయంతి వేడుకలు



**శామీర్ పేట్ (జనంసాక్షి ):**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల శామీర్ పేట్ లో తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.తెలుగు భాష గొప్పతనాన్ని గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని తెలుపుతూ పాటలు, ఉపన్యాసాలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. చేతన తెలుగు అధ్యాపకులు డా. వి. హర్షిత, వి. మేఘ స్రవంతి మరియు అధ్యాపక బృందం విద్యార్థినులు పాల్గొనీ విజయవంతం చేశారు.

# యువత క్రీడాలపై ఆసక్తి పెంచుకోవాలి

### ఏసీపీ రాములు



**శామీర్‌పేట్ (జనం సాక్షి ) :** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని పేట్ బషీరాబాద్ ఏ సీపీ రాములు అన్నారు. గురువారం షామీర్పేట్ మండలం తుర్కపల్లి గ్రామంలో జీనోమ్ వ్యాల్యూ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యాదయ్య ఆధ్వర్యంలో సెయింట్ మేరీ సెంట్రల్ స్కూల్ లో జనం వ్యాల్యూ పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల టోర్నమెంట్ ను పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు.ప్రారంభించారు. ఈ సందర్బంగా ఏసీపీ రాములు మాట్లాడుతూ... ప్రజలకు పోలీసులు ఫ్రెండ్లీ పోలిసింగ్ ఉండాలనే ఉద్దేశ్యంతోనే క్రీడలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నేరాలు అరికట్టడంలో యువత పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్య క్రమంలో నాయకులు వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎక్స్ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ జైపాల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహారావు

**కాప్రా, ఆగస్టు 29 (జనంసాక్షి) :** బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దామని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహారావు అన్నారు. బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ ను కమలానగర్ పార్టీ కార్యాలయంలో కాప్రా సర్కిల్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహారావు హాజరై మాట్లాడుతూ.. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచ బ్యాంకుకు ప్రయోగశాలగా ప్రభుత్వం ఉంచి, ప్రవేటికరణ విధానాలకు బాటలు వేసిందన్నారు. ఇందులో భాగంగా విద్యుత్తును సంస్థ ను, ప్రైవేటు పరం చేసి ప్రజలపై విద్యుత్ భారాలు మోపే ప్రయత్నం చేశారు. దీనిని నిరసిస్తూ సిపిఎం పార్టీ, ఇతర వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 2000 సంవత్సరం ఆగస్టు 28న బషీర్ బాగ్ లో తమ నిరసనను




తెలియజేయడానికి వెళుతున్న సందర్భంలో పోలీసులతో లాఠీచార్జి చేయించి, బాష్పాయులను ప్రయోగించి, గుర్రాలతో తొక్కించి, బుల్లెట్ల వర్షం కురిపించాడు. ఈ మారణకాండలో 245 మంది వరకు గాయాల పాలయ్యారు. రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి బుల్లెట్ తూటాలకు బలిఅయి వీరమరణం పొందారు. విద్యుత్ ఉద్యమ ప్రభావంతో కొన్ని సంవత్సరాల పాటు ఛార్జీలు పెంచకుండా ధైర్యం చేయలేకపోయాయి. విద్యుత్ ఉద్యమం స్ఫూర్తిదాయకమని అన్నారు. అమరవీరుల త్యాగం వృధా కాకుండా ఈ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఈ పోరాట స్ఫూర్తితోనే కార్మిక, రైతాంగ, ప్రజా సమస్యల పైన విద్య, వైద్యం, యువత ఉపాధి సమస్యల పైన స్ఫూర్తితో అనేక పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు



జి.యాదగిరి రావు, కాప్రా సర్కిల్ కమిటీ సభ్యులు బివి సత్యనారాయణ, పి.గణేష్ నాయకులు ఎం.శ్రీనివాస్, దేవిరెడ్డి, శ్రీమన్నారాయణ, శరత్ బాబు, సోమయ్యచారి, నూర్జహాన్, సరోజ, బాలరాజు, వెంకటేష్, ఆదాము, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ నిర్ధారణకు సహకరించాలి

## మండల వ్యవసాయ అధికారులు అనురాధా



**మొయినాబాద్,29(జనం సాక్షి) :** రుణమాఫీ వర్తించని ప్రతి రైతు కుటుంబ నిర్ధారణను చేపడతామని అందుకు రైతులందరూ సమన్వాయంగా వ్యవహరించి సహకరించాలని మండల వ్యవసాయ అధికారి అనురాధా పేర్కొన్నారు. కుటుంబ నిర్ధారణ కార్యక్రమం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అనురాధా గురువారం ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ మొయినాబాద్ మండలంలో 598 మంది కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉందని ఆమె తెలిపారు. అందులో భాగంగా మొదటి రోజు నక్కలపల్లి గ్రామంలో ప్రారంభించడం జరిగిందన్నారు. అధికారులుత మ ఇంటి వద్దకు వచ్చినప్పుడు 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఉండాలన్నారు. ఎవరు ఆందోళన చెందవద్దు అని ప్రతి ఒక్కరి కుటుంబ నిర్ధారణ చేస్తామని తెలిపారు. రైతులు అధికారులకు ఆధార్ కార్డు చూపించాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలకు ఫోన్ ద్వారా సమాచారం అందించి వివరాలు సేకరిస్తామని ఆమె పేర్కొన్నారు. ఇందుకు గాను మొయినాబాద్ మండలంలో వ్యవసాయ శాఖ ద్వారా రెండు వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయని మొయినాబాద్ క్లస్టర్ కాగా ఈ క్లస్టర్లో అధికారి సునిల్ ఉంటారని ఈ క్లస్టర్ కింద రైతులు ఇతర సమాచారం కోసం 8184945806లో సంప్రదించాలని కోరారు. అదే విదంగా రెండవ క్లస్టర్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి క్లస్టర్ సజ్జన్పల్లి గ్రామ సమీపంలో ఉందని ఈ క్లస్టర్ కుమార్ అధికారి ఉంటారని ఈ క్లస్టర్ కింద వచ్చే రైతులు 6305920250లో సంప్రదించి అనుమానాలను ఇతర వివరాలను తెలుసుకోవచ్చునని ఆమె పేర్కొన్నారు.

## సాయంత్రం ఐదు దాటితే యాచారం బస్టాండ్‌లో కనిపించని కంట్రోలర్



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 29 (జనం సాక్షి) :** యాచారం ఆర్టీసీ బస్టాండ్ లో సాయంత్రం 5 అయితే కనిపించని కంట్రోలర్ పూర్తి స్థాయిలో కంట్రోలర్ ను నియమిచాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకు కంట్రోలర్ ను ఏర్పాటు చేయాలి కంట్రోలర్ లేకపోవడంతో బస్సులు బస్సు స్టాండ్ లోకి రాకుండా పోతున్నాయి అని ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి కంట్రోలర్ ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సమాచారం తెలిపేవారు లేరని ప్రయాణికులు అంటున్నారు.




## నవీన ఆదర్శ పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం వేడుకలు

**కొడంగల్ ఆగస్టు29(జనం సాక్షి):** కొడంగల్ పట్టణ కేంద్రంలో నవీన ఆదర్శ హైస్కూల్ లో తెలుగు భాష దినోత్సవం మరియు జాతీయ క్రీడలా దినోత్సవం వేడుకలు విద్యార్థులు ఉపాధ్యాయుల బృందం ముందుగా గిడుగు రామ్మూర్తి,హాకీ ప్లేయర్ జ్ఞాన్ చంద చిత్రపటా లకు పూలమాల వేసి నివాళి అర్పించి ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపన్యాసాలు పద్యాలు,పాటలు పాడారు.అనంతరం ప్రిన్సిపాల్ నరేష్ రాజు మాట్లు ఆడుతూ తెలుగు మాతృభాష గురించి, హాకీ ప్లేయర్ జ్ఞాన్ చంద జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ .డివి నరేష్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష ,ఉపాధ్యాయ బృందం. శకుంతల, నాగేంద్రమ్మ మిరాజ్ బేగం ,సంగీత, సునీత, అరుణ జ్యోతి ,అరుణ,ఫాతిమా,సన, ప్రభాకర్, హతహీక్, సంతోష్ పాల్గొన్నారు.

## 15వ వార్డులో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు



**రాజేంద్రనగర్, ఆగస్టు29(జనం సాక్షి) :** మాలిక వసతులకే అధిక ప్రాధాన్యత నిస్తున్నామని నార్సింగ్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు లో కౌన్సిలర్ పద్మ వీరారెడ్డి తో కలిసి రూ.50 లక్షల వ్యయంతో రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు జరిపిస్తున్నామని, మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి సమస్యలైనా నేరుగా సంప్రదిస్తే అట్టి సమస్యలకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా రెండవసారి రేగళ్ళ సతీష్ రెడ్డి





**కాప్రా, ఆగస్టు 29 (జనంసాక్షి) :** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యుల సహకారంతో దైవభక్తిని పెంచేలా ఉత్సవాలు నిర్వహిస్తూ, రాబోయే తరాలకు భారతీయ సంస్కృతిని తెలియజేసేలా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తామని, నాపై నమ్మకంతో రెండవసారి కన్వీనర్ పదవి ఇచ్చినందుకు భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి సభ్యులకు హిందూ బంధువులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని రేగళ్ళ సతీష్ రెడ్డి తెలిపారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కాప్రా డివిజన్ సమావేశంలో నూతన డివిజన్ కన్వీనర్ గా రేగళ్ల సతీష్ రెడ్డి ని ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా ఉప్పల్ అసెంబ్లీ కో కన్వీనర్ చల్ల ప్రభాకర్ హాజరై, గణేష్ ఉత్సవ సమితి సభ్యులందరి సమక్షంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి సీనియర్ సభ్యులు మర్రి మోహన్ రెడ్డి, రాఘవ రెడ్డి, కమల్ పంత్, మల్లరెడ్డి, కొప్పుల కుమార్, అమిత్, పవన్, నాగరాజు గుప్తా, శ్రీకాంత్ గౌడ్, సోమనాథ్, శ్రీకాంత్, రాజువంశరాజు, జ్ఞానేశ్వర్, సురేష్ నాయక్, ఉత్సవ సమితి సభ్యులు వెంకటరెడ్డి, జగ్గారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి జన్మదిన వేడుకలు



**తాండూరు అగస్టు 29(జనంసాక్షి)** పట్టణ మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం పట్టణంలోని వివిధ పార్టీల నాయకులు, మున్సిపల్ సిబ్బంది సమక్షంలో కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మరెన్నో తమ పదవులు చేపట్టాలని మనసారా ప్రార్థించారు. ఈ జన్మదినం వేడుకల్లో జనసమితి పార్టీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సోమశేఖర్ , కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు ,కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## సీసీ రోడ్డు పనులకు చైర్మన్ చంద్రారెడ్డి శంకుస్థాపన

**కీసర, ఆగస్టు 29 (జనంసాక్షి) :** దశలవారీగా అన్ని వార్డులలో అభివృద్ధికి కృషి చేస్తున్నాననిచైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు ఆర్ఎల్ నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్ తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ బుదవరం లక్ష్మి వేణుగోపాల్ మాట్లాడుతూ.. అన్ని కాలనీలకు నిధులు కేటాయిస్తూ, వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీసంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా

# కలెక్టరేట్‌లో ఆటల పోటీలు

### పోటీలను ప్రారంభించిన డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఏఓ రామ్మోహన్



**మేడ్చల్ జిల్లా ప్రతినిది, ఆగష్టు 29 (జనంసాక్షి) :** తన ఆట ప్రదర్శనతో దేశానికి అపారమైన కీర్తిని ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ అని మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ కొనియాడారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఆటల పోటీలను లా ఆఫీసర్ చంద్రావతి, ఏఓ రామ్మోహన్ లతో కలిసి జిల్లారెవెన్యూ అధికారి హరిప్రియ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడల అధికారి ఆధ్వర్యంలో రన్ అండ్ వాక్, లెమన్ అండ్ స్పూన్, షాట్ పుట్, త్రోబాల్, చెస్, టగ్ ఆఫ్ వార్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ ఛైర్ వంటి ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొంది వరకే బహుమతులు అందజేస్తూ అధికారులు మాట్లాడుతూ.. క్రీడాల్లో రాణించి జాతీయ స్థాయిలో పేరు, ప్రఖ్యాతులు సాధించవచ్చన్నారు. క్రీడలు మానసిక, శారీకక ధృఢత్వాన్ని పెంపొందించుకో వచ్చున్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. ఈ ఆటల పోటీలలో కలెక్టరేట్ సిబ్బంది ఉత్సహాంగా పాల్గొన్నారు.





# చైతన్య రథసారథి నందమూరి హరికృష్ణకు ఘనంగా నివాళులు



**కాప్రా, ఆగస్టు 29 (జనంసాక్షి) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు చైతన్య రథసారథి మాజీ మంత్రి, పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ రాజ్యసభ సభ్యుడు స్వర్గీయ నందమూరి హరిక్రిష్ణ 6వ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ లోని జమ్మిగడ్డ ఎన్టీఆర్ కూడలి వద్ద స్వర్గీయ నందమూరి హరిక్రిష్ణ చిత్ర పటానికి, తెలంగాణా తెలుగుదేశం పార్టీ ఉప్పల్ నియోజకవర్గ మాజీ ఇన్చార్జి కందికంటి అశోక్ కుమార్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు అన్న నందమూరి తారకరామారావు తోడుగా రాష్ట్రం నలుమూలల చైతన్య రథసారథిగా ఎన్నో లక్షల కిలోమీటర్ల ప్రయాణం చేసి, తండ్రికి చేదోడు వాదోడుగా అన్నీ తానై చూసుకుంటూ, రాష్ట్రంలోని ఎంతోమంది తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు అన్న హరికృష్ణ గా పిలవబడ్డాడు. తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలు ఎనలేనివి అని, ఆయన సేవలను ఎప్పటికీ తెలుగుదేశం పార్టీ మరువదని, ఆయన ఆశయాలకు అనుగుణంగా మనమందరం పనిచేయాలని, అప్పుడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డమీద రాములు యాదవ్, దూడల సాంబమూర్తి గౌడ్, దూడల నిర్మల సాంబమూర్తిగౌడ్, నీరుకొండ సతీష్ బాబు, శ్రీరాములు, సాంభశివరావు, బింగి భిక్షపతి గౌడ్, తిక్కప్రకాష్, శివనంద్, పరంధామయ్య, రవి, గోబెరు రమేష్, నందంగౌడ్, క్రిష్ణ, సత్యం, సతీష్ కుమార్, నవీన్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.



# లక్ష రూపాయల లంచం

### ఏసీబీకి అడ్డంగా దొరికిన కలెక్టరేట్ సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రాజు



**మేడ్చల్ జిల్లా ప్రతినిది, ఆగస్టు 29 (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ సహకార శాఖ అధికారి ఏసీబీకి చిక్కారు. లక్ష రూపాయల లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. ఏసీబీ సిటీ రేంజ్ 2 డీఎస్పీ శ్రీధర్ కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లోని సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో బొమ్మల శ్రీనివాస్ రాజు అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్నారు. నవభారత్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ కేసులో ఫిర్యాదుదారు సహాయం చేయాలని, అర్బిట్రేటర్ గా ఉన్న శ్రీనివాస్ రాజును కలిసి కోరారు. దీంతో శ్రీనివాస్ రాజు ఫిర్యాదుదారుకు అనుకూలంగా చేసేందుకు రూ.5లక్షల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే తాను అంత లంచం ఇవ్వలేనని, ఒక లక్ష రూపాయలు మాత్రమే ఇస్తానన్నాడు. ఈ విషయమై ఈ నెల 24వ తేదీన బాధితుడు, ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బాధితుడు లక్ష



రూపాయల నగదు తీసుకొని, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ రాజు సమాచారం ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ రాజు తన కారు కలెక్టర్ కార్యాలయం పార్కింగ్ లో ఉందని, అందులో పెట్టాలని సూచించారు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు శ్రీనివాస్ రాజును రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కారు ఎవరి పేరు మీద ఉందని శ్రీనివాస్ రాజును ప్రశ్నించగా తన అబ్బాయి పేరిట ఉందని ఒప్పుకున్నాడు. నగదు స్వాధీనం చేసుకొని శ్రీనివాస్ రాజును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

# అత్తాపూర్ పిఎస్ పరిధిలో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల అరెస్టు

**రాజేంద్రనగర్ (జనం సాక్షి) :** సైబరాబాద్ అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన అత్తాపూర్ పోలీసులు. గురువారం రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్, ఏసిపి శ్రీనివాస్‌లు తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడ జాగీర్, సన్ సిటీ, పిఅండ్ టి కాలనీకి చెందిన ముజాహిద్ (45) చంద్రాయన గుట్ట బండ్లగూడ గౌస్ నగర్ కు చెందిన మొహమ్మద్ అబ్దుల్ రహీం (39)లు ఆగస్టు 26న ఉదయం ఎ1 ముజాహిద్,ఎ2 మొహమ్మద్. అబ్దుల్ రహీం తమ మోటార్ సైకిళ్లపై ప్రశాంత్‌నగర్, శివరాంపల్లికి



చెందిన రాహుల్ వర్ధన్ గౌడ్‌కి చెందిన కిరాణా షాపు వద్దకు నిందితులు వచ్చి తాము అవినీతి నిరోధక శాఖకు చెందిన వారమని, చెప్పి సెల్ ఫోన్ లో వీడియో తీస్తున్నట్లు గా నటించి మీరు అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందని, ఇట్టి వీడియోని సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించి, అతనిని రూ.10 వేలు ఇవ్వవలసినదినదిగా డిమాండ్ చేసి, అదే రోజు రూ.3వేలు తీసుకున్నారు. మిగతా డబ్బుల కోసం పదే పదే బాధుతునికి బెదిరింపు ఫోన్ కాల్స్ రావడంతో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఆగస్టు 28న అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకట్ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రెండు మోటార్ సైకిల్ లను, రెండు సెల్ ఫోన్ లను ఐదు ఐడి కార్డ్ లను స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసి కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు అధికారి ఎన్.వెంకన్న తెలిపినారు.

# బిజెపి నాయకురాలు శైలజ పుట్టినరోజు

**కీసర, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకొని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. భాజపా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శైలజ పుట్టినరోజు సందర్భంగా గురువారం నాగారం మున్సిపాలిటీలోని గ్రంథాలయానికి ఛైర్మన్ చంద్రారెడ్డి చేతుల మీదుగా పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. పాఠకులు, విద్యార్థులు గ్రంథాలయంలో అందుబాటులో ఉండే పుస్తకాలను సద్వినియోగం చేసుకొని, విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. బీజేపీ మహిళా

### ఛైర్మన్ చంద్రారెడ్డి చేతుల మీదగా లైబ్రరీకి పుస్తకాల అందజేత



మోర్చా నాయకురాలు శైలజ పుట్టినరోజు సందర్భంగా గ్రంథాలయంకు పుస్తకాలను అందజేయడం అభినందనీయమన్నారు. వార్త దినపత్రికలతో పాటు వివిధ రకాల విజ్ఞానాన్ని పెంపొందించే ఎన్నో అద్భుతమైన పుస్తకాలు ఉన్నాయని, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమన్నారు.

# హైడ్రాతో పెరిగిన రేవంత్ ఛరిష్మా

**సూర్యుడి చుట్టూ భూమి భ్రమణం చేస్తుందన్నది ఎంత నిజమో ప్రస్తుతం మన రాష్ట్ర రాజకీయాలు హైడ్రా చుట్టూ పరిభ్రమిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. యావత్ తెలంగాణలో ఏ నలుగురిని కదిలించినా హైడ్రా దూకుడు హైడ్రా హడల్ అంటూ డిస్కషన్ పెడుతున్నారు. ఇదొక మంచి పరిణామం. ఎందుకంటే, ఎన్విరాన్మెంటల్ బ్యాలెన్స్ అనేది మనకి చాలా ముఖ్యం. తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే అంశంపై పెద్ద ఎత్తున దృష్టి సారించడం హర్షించాల్సిన విషయం.**

గత పదేండ్లలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు కబ్జాకు గురైనట్టు ఎప్పుడూ కాలేదు. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలోనైతే ఈ పరిస్థితి మరీ దారుణంగా తయారు అయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా చెరువులు, కుంటల కబ్జాలు జరిగాయన్న విషయం చిన్న పిల్లలను అడిగినా చేప్పే పరిస్థితి ఉన్నది. కాగా, గతేడాది డిసెంబర్‌లో తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టిన రేవంత్ సర్కారు, కేసీఆర్ హయాంలో అవకతవకలను ఒక్కటొక్కటిగా వెలికి తీస్తూ అడుగులు వేస్తున్నది. తొలుత కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ అంశం తాజాగా 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చర్యలతో రాజధాని హైదరాబాద్‌లోని చెరువుల్లో ఆక్రమణలపై ప్రభుత్వం చాలా ధృడ సంకల్పంతో ముందుకు వెళుతున్నది. ఇలాగా ముందుకు వెళ్ళడం కూడా మన రాష్ట్ర భవిష్యత్ కు ఎంతగానో అవసరం కూడా.

హైదరాబాద్ నగర పరిధిలోని శేరిలింగంపల్లి ప్రాంత తహశీల్దార్ ఇప్పటికే 204 మందికి నోటీసులు పంపారు. నెల రోజుల్లో ఎవరికి వారే స్వచ్ఛందంగా అక్రమ నిర్మాణాలు తొలగించుకోవాలని లేకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసులు పంపారు. హైడ్రా నోటీసులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి స్పందించారు. తాను నివాసం ఉంటున్న ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే ప్రభుత్వం, హైడ్రా ఎలాంటి చర్యలు తీసుకున్నా నాకు అభ్యంతరం లేదని ఆయన చెప్పడం స్వాగతనీయం. ఇలాంటి పెద్దలు పెద్ద మనసుతో ముందుకు వస్తే అందరికీ మంచి జరుగుతుంది.

ఇక గత కొన్ని రోజులుగా హైడ్రా కూడా దూకుడు పెంచడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. దీంతో సామాన్య ప్రజల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున సానుకూలత పెరిగింది.

హైడ్రా అధికారులు హైదరాబాద్ పరిధిలోని అనేక ప్రదేశాలలోని ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, లే అవుట్లలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, పరిశ్రమల శాఖకు చెందిన స్థలాల్లోని అక్రమ భవనాలను కూల్చుతున్నారు. చట్టాల పరిధిలో పనిచేస్తూ, చట్టాలను తోసిపుచ్చి నిర్మించిన అనేక భవనాలను బుల్డోజర్లతో కూల్చేస్తూ.. ఆక్రమణలకు గురైన చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడం సర్వత్రా సంతోషకరమైన అంశం. గత పది రోజులుగా హైడ్రా అధికారులు చేపట్టిన ఈ కార్యక్రమంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. హైడ్రా వేగం చూసే జన్వాడ ఫాంహౌస్ కేసులో మాజీ కేటీఆర్ తన బినామీ వ్యక్తి(పేరుకే లీజుకు తీసుకున్న అని చెప్పారు)తో హైకోర్టును ఆశ్రయించినా.. అక్కడేం ఊరట కల్గలేదు. ఇక ప్రముఖ సినీ నటుడు తుమ్మిడికుంట చెరువును కబ్జా చేసి కట్టిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేడయం సాహసోపేతమైన చర్యగా అభివర్ణించవచ్చు. చెరువులు, కుంటలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలు తన మిత్రులవైనా విడిచిపెట్టేది లేదని సీఎం చెప్పడం స్వాగతనీయం. హైడ్రాకు స్వయంప్రతిపత్తి కల్పించి ఆ సంస్థ కమిషనర్‌గా ఏవీ రంగనాథ్‌ను నియమించిన ప్రభుత్వం, చాలా మంచి పని చేసిందని చెప్పవచ్చు. ఆయనకు మంచి సిన్సియర్ అధికారి అని పోలీసు డిపార్టుమెంటులో పేరుంది. అందుకే, అన్యాక్రాంతమైన భూములను రక్షిస్తూ అక్రమార్కులు, విక్రమార్కుల గుండెల్లో ఆయన రైళ్ళను పరిగెత్తిస్తున్నారు. ఆ సంస్థ స్వతంత్రంగా పనిచేసే అవకాశాన్ని కల్పించి, రాజకీయ విమర్శలు రాకుండా జాగ్రత్తపడుతోంది. ఇదే సమయంలో గత పదేళ్ల కాలంలో తమ ప్రాంతాలలో జలసిరితో కళకళలాడిన చెరువులు, కుంటలను పూడ్చి అక్రమ నిర్మాణాలు చేపట్టిన బీఆర్ఎస్ నేతల అక్రమాలను బయటపెట్టటమే హైడ్రా లక్ష్యమని, వారు చెరపట్టిన ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూముల కబ్జాల అంతు చూడాలని కూడా సామాజిక, పర్యావరణ వేత్తలు బలంగా కోరుకుంటున్నారు. గతంలో అక్రమ నిర్మాణాలపై కేసీఆర్ ప్రభుత్వం చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలిపోగా, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. పార్టీలు, వర్గాలకు అతీతంగా ప్రభుత్వ భూములను చెరబట్టిన వారి పీచమణచటమనే పనిని మొదలు పెట్టి తన నిబద్ధతను చాటుకుంటోందనే ప్రశంసలు తెలంగాణ ప్రజానీకం నుంచి వెల్లువెత్తుతున్నాయి. అయితే,




విపక్ష బీఆర్ఎస్ నేతలు మాత్రం హైడ్రా తమ పార్టీ నేతలను భయభ్రాంతులకు గురిచేయటమే లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శలకు దిగుతున్నారు. హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే, ఒక అడుగు ముందుకు వేసి ఏకంగా ఎదురుదాడి మొదలుపెట్టారు. హైడ్రా కేవలం తమ పార్టీ నేతల నిర్మాణాలనే లక్ష్యంగా చేసుకుంటోందని, కాంగ్రెస్ మంత్రులు, టీడీపీ అధినేత నిర్మాణాల జోలికిపోగలదా? అంటూ పస లేని వాదనను తెరపైకి తెచ్చే యత్నం చేశారు. తద్వారా ఒక స్వతంత్ర ప్రభుత్వ సంస్థ తీసుకుంటున్న నిర్ణయాలకు ఆటంకం కలిగించటమే కాకుండా వాటికి రాజకీయ రంగు పూసే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా తమ పార్టీ నేతలు అక్రమ నిర్మాణాలు చేపట్టారనే విషయాన్ని ఆయన పరోక్షంగా అంగీకరించారని భావించాల్సి వస్తోంది. హైడ్రా తీసుకుంటున్న చర్యలను సామాన్యులు స్వాగతిస్తుంటే.. బీఆర్ఎస్ నేతలు మాత్రం గుమ్మడికాయ దొంగ ఎవరంటే.. భుజాలు తడుముకున్నట్లుగా పొంతనలేని వాదనలు చేస్తున్నారు. ఒకవేళ, రేపోమాపో హైడ్రా గనక జన్వాడ ఫాంహౌస్‌ను కూల్చివేసే పరిస్థితే వస్తే, గత పదేళ్ల కాలంలో కేటీఆర్‌ను నమ్ముకొని చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి కట్టుకున్న తమ భవనాల పరిస్థితి ఏమిటి? పార్టీ అధినేతే తన అక్రమ భూములను కాపాడుకోలేక పోతే ఇక తమ పరిస్థితి ఏమిటని మెజారిటీ నేతలు లోలోన మనోవేధన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఇది హైదరాబాద్‌కే పరిమితం కాదని, రానున్న రోజుల్లో జిల్లా, మండల స్థాయి వరకు హైడ్రా చర్యలు తీసుకోనున్నదనే వార్తలతో క్షేత్రస్థాయిలోని గులాబీ శ్రేణుల్లో కలకలం నెలకొంది. ఇదే సమయంలో.. గత పదేళ్లుగా వీరు చేపట్టిన అక్రమ నిర్మాణాల గురించి ఫిర్యాదులు చేసీచేసీ విసిగిపోయిన సామాజిక కార్యకర్తలు, పర్యవరణ ప్రేమికులు.. మరోసారి ధైర్యంగా తమ ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాల మీద ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. గత ఎనిమిది నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్ఎస్ హయాంలో సాగిన పలు అక్రమాలను గుర్తించి, వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. వీటిని రాజకీయకోణంలో చూస్తూ విపక్షాలు విమర్శలు చేస్తున్నప్పటికీ

**అన్యాక్రాంతమైన భూములను రక్షిస్తూ అక్రమార్కులు, విక్రమార్కుల గుండెల్లో ఆయన రైళ్ళను పరిగెత్తిస్తున్నారు. ఆ సంస్థ స్వతంత్రంగా పనిచేసే అవకాశాన్ని కల్పించి, రాజకీయ విమర్శలు రాకుండా జాగ్రత్తపడుతోంది. గత పదేళ్ల కాలంలో తమ ప్రాంతాలలో జలసిరితో కళకళలాడిన చెరువులు, కుంటలను పూడ్చి అక్రమ నిర్మాణాలు చేపట్టిన బీఆర్ఎస్ నేతల అక్రమాలను బయటపెట్టటమే హైడ్రా లక్ష్యమని, వారు చెరపట్టిన ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూముల కబ్జాల అంతు చూడాలని కూడా సామాజిక, పర్యావరణ వేత్తలు బలంగా కోరుకుంటున్నారు.**

ప్రభుత్వం మాత్రం ధైర్యంగా ముందడుగు వేస్తోంది. మరీ ముఖ్యంగా తెలంగాణకు ప్రధాన ఆర్థిక కేంద్రంగా ఉన్న హైదరాబాద్ ప్రతిష్టకు మచ్చ తెచ్చే ఏ ప్రయత్నాన్నీ కాంగ్రెస్ సర్కారు ఉపేక్షించటం లేదు. డ్రగ్స్ మీద ఉక్కుపాదం, శాంతిభద్రతల వంటి అంశాలలో ఇప్పటికే ప్రభుత్వ చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. అటు.. గొర్రెల స్కామ్, కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోనూ ప్రభుత్వ నిర్ణయాలు సామాన్యుల మన్ననలు అందుకున్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు మరో గుర్తింపు తెచ్చేందుకు రాజధానిని ఆనుకుని మరో నగర నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ హబ్, ఐటీ పార్కులు, హెల్త్ హబ్, ఏఐ ఆధారిత సంస్థలు ఈ కొత్త నగరంలో కొలువుదీరనున్న వేళ.. భాగ్యనగరపు భవితను దెబ్బతీసే ఏ చర్యనూ సహించకూడదనే ధోరణితో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారు. ఈ సాహసోపేతమైన అడుగుల ద్వారా సీఎం రేవంత్ తెలంగాణ రాజకీయాల్లో నయా ట్రెండ్ అయితే స్రుష్టించగలిగారని స్పష్టంగా చెప్పగలం. ఇదేవిధంగా ముందుకువ వెళితే.. రేవంత్ రెడ్డి ఎదురులేని నాయకుడిగా ముందుకు వెళతారని రాజకీయ విశ్లేషకులు సైతం చెబుతున్న విషయాన్ని మరవలేం.



**వెంకటేష్ చారి**
తెలంగాణ ఉద్యమకారుడు

**అటు.. గొర్రెల స్కామ్, కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోనూ ప్రభుత్వ నిర్ణయాలు సామాన్యుల మన్ననలు అందుకున్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు మరో గుర్తింపు తెచ్చేందుకు రాజధానిని ఆనుకుని మరో నగర నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ హబ్, ఐటీ పార్కులు, హెల్త్ హబ్, ఏఐ ఆధారిత సంస్థలు ఈ కొత్త నగరంలో కొలువుదీరనున్న వేళ.. భాగ్యనగరపు భవితను దెబ్బతీసే ఏ చర్యనూ సహించకూడదనే ధోరణితో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారు.**

